సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



తేలని హద్దులు.. తీరని బాధలు

ఇల్లెందు మండలంలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు తేలక రైతులకు పాస్ పుస్తకాలు అందడం లేదు.

8లో



ఇద్దరు మావోల అరెస్ట్

మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యులతోపాటు ఒక కొరియర్‌ను జిల్లా పోలీసులు చర్లలో అరెస్ట్ చేశారు.

10లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మిగతా చోట్ల మాత్రం ఎండ గరిష్టస్థాయిలో ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామి ని ముత్తంగి రూపంలో అలంకరించటం ఇక్కడ ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆతర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.

సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి



డీఈఓకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి సూచించారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లిలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సామర్థ్యాలను తనిఖీ చేశాక బోధన, మధ్యాహ్న భోజనం అమలుపై సూచనలు చేశారు. అలాగే, కిచెన్ గార్డెన్ నిర్వహణపై ఆరా తీశారు. ఏఎస్ఓ సతీష్, హెచ్ఎం ఎం.జ్యోతిరాణి, ఐఈఆర్‌టీ జి.నీరజా షారోన్ పాల్గొన్నారు.

అప్రెంటిస్ దరఖాస్తు గడువు పొడిగింపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో అప్రెంటిస్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసునే గడువును ఈనెల 30వరకు పొడిగించారు. తొలుత ప్రకటించిన గడువు సోమవారంతో ముగియగా మళ్లీ పొడిగించినట్లు హెచ్ఆర్‌డీ జీఎం కృష్ణయ్య తెలిపారు. కొన్ని ట్రేడ్లలో దరఖాస్తులు తక్కువగా రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, అక్టోబర్ 1వ తేదీవరకు ఏరియాల్లోని ఎంవీటీసీ కార్యాలయాల్లో ఇవ్వాలని జీఎం సూచించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్ అధికారులకు అందజేశారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. అలాగే, సీజనల్ వ్యాధులు వ్యాప్తి నేపథ్యాన వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏపీఓ(పవర్) మునీర్‌పాషా, వివిధ శాఖల ఉద్యోగులు ఆదినారాయణ, నరేష్‌కుమార్, ఉదయ్‌కుమార్, బాలు, లింగానాయక్, ప్రభాకర్‌రావు, నరేందర్, ప్రమీలభాయి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే కనకయ్య, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాటిల్, అద్వైత్‌కుమార్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

ప్రభుత్వ ఆలోచనలు ప్రతిబింబించాలి..

వరద ప్రభావిత ప్రాంతాల్లో పనులు పెండింగ్ ఉండొద్దు

- విద్య, వైద్యం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- ప్రభుత్వ భూములు కబ్జా అయితే అధికారులే బాధ్యులు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందురూరల్/ఇల్లెందు: అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వ ఆలోచనలే అధికారుల పనితీరుతో ప్రతిబింబించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెంలో సోమవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమీక్షలో విద్య, వైద్యం, విద్యుత్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల నివేదికలను పరిశీలించిన మంత్రి పొంగులేటి సూచనలు చేశారు. ఈక్రమంలో వివిధ శాఖల అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలని హితవు పలికారు.

ఆగ్రహం

బయ్యారం, గార్ల మండలాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ఈఈ వరద ప్రభావిత ప్రాంతాల్లో పనులను వివరిస్తూ కొన్నింటిని రద్దు చేశామని చెప్పగా మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదన దశలో ఉన్న వంతెన పనుల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకురావాల్సింది పోయి రద్దు చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, ఉపాధ్యాయుల సర్దుబాటు విషయమై అధికారుల అస్పష్ట సమాధానాలపై మండిపడ్డారు. అధికారులు తాము పనిచేసే శాఖలు, పనులపై పట్టు సాధిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని తెలిపారు.

అసహనం

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఛిద్రమైన రహదారులు, వంతెన మరమ్మతులను నేటికీ పూర్తి చేయకపోవడంపై మంత్రి పొంగులేటి అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేయించాలని ఆదేశించారు. సగం సగం పనులు చేస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పరిపాలనా పరమైన పనులు పెండింగ్‌లో ఉంటే కలెక్టరేట్‌లో నివేదిక ఇచ్చేస్తే సరిపోదని.. వెంట పడి మంజూరు చేయించుకోవాలని సూచించారు. వరదల ప్రభావంతో పలు గ్రామాల్లో నేలకూలిన విద్యుత్ స్తంభాలను మార్చడంలో జాప్యం చేయకుండా రైతులకు త్వరగా కనెక్షన్లు జారీచేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని.. పైప్‌లైన్లు పగిలిపోతే మరమ్మతు పనులు పంచాయతీలకు అప్పగించి వదిలేయకుండా పూర్తిచేయించాలని తెలిపారు.

ఆదేశం

ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని, అవసరమైతే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని మంత్రి తెలిపారు. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో నిపుణులైన వైద్యుల భర్తీ, అదనపు పడకల ఏర్పాటు విషయంలో రాజీ పడబోమని చెప్పారు. కాగా, విద్య, వైద్యం, ఉపాధి కల్పన విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని తమ ప్రభుత్వం క్షమించబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు కబ్జాకు గురైతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ అవసరాలు పోను మిగులు భూమిని పేదలకు పంచాలని అధికారులను ఆదేశించారు.

సూచనలు

ఇల్లెందు మండలంలో నిరుపయోగంగా ఉన్న గిరిజన భవన్‌ను మున్సిపాలిటీకి అప్పగించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా మున్సిపాలిటీకి అప్పగించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, భూముల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలని, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా పర్యవేక్షించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు సూచించారు. ట్రైకార్ రుణాలకు సంబంధించి 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని ఐటీడీఏ పీఓ రాహుల్ చెప్పగా సూచనలు చేశారు.

పారదర్శకతకు ప్రాధాన్యత

నియోజవకర్గ స్థాయి సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పనితీరు, క్షేత్రస్థాయిలో సమస్యలు, పరిష్కారంపై స్పష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు. సొంత ఆలోచనలను జనంపై రుద్దకుండా పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి రేషన్‌కార్డుల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించి రేషన్‌కార్డులతోపాటు హెల్త్‌కార్డులు కూడా జారీ చేస్తామని తెలిపారు. వచ్చేనెల 15వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రక్రియలను పారదర్శకంగా చేపట్టేలా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమీక్షలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి.పాటిల్, అద్వైత్ కుమార్ సింగ్, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ప్రజాప్రతినిధులు మువ్వ విజయ్‌బాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీ, పీఏసీఎస్‌ల చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ మౌనం వీడేదెన్నడు ?!

- 'పెదవాగు' పరిహారంపై జాడ లేని విచారణ
- అర్హులైన రైతులకు న్యాయం జరగలేదని ఆరోపణలు
- కలెక్టర్ విచారణకు ఆదేశించినా పట్టించుకోని యంత్రాంగం
- ఆందోళనలకు సిద్ధమవుతున్న బాధిత రైతాంగం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి సమీపాన పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు పరిహారం చెల్లింపుల్లో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన బాధిత రైతులకు పరిహారం అందకపోగా.. సెంట్ భూమి కూడా లేని వారి ఖాతాల్లో పరిహారం జమ అయింది. ఈ వ్యవహారంపై 'సాక్షి'లో ఈనెల 10వ తేదీన 'పరిహారంలో.. అధికార పరివారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ జితేష్ పాటిల్ మౌఖికంగా విచారణకు ఆదేశించారు. ఇది పది రోజులు దాటినా అధికారులు విచారణ ఊసెత్తకపోవడం రైతుల ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. ఇకనైనా విచారణ జరిపి అర్హులైన వారికి పరిహారం అందించాలనే డిమాండ్‌తో బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

నకిలీలే ఎక్కువ...

మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టుకు జూలై 18వ తేదీన భారీగా వరద పోటెత్తింది. దీంతో ప్రధాన ఆనకట్టకు గండ్లు పడ్డాయి. ఫలితంగా పెదవాగు ప్రవాహంతో రైతుల పంట పొలాలు వరద పాలై రైతులకు రూ.లక్షల్లో నష్టం జరిగింది. ఈ మేరకు నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎకరానికి రూ.10,418 చొప్పున పరిహారాన్ని ప్రకటించి సర్వే చేయించారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఏడీఏ అఫ్జల్ బేగం పర్యవేక్షణలో 11 మంది ఏఈఓలతో హడావుడిగా సర్వే చేయించగా 391.19 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తేల్చారు. అంతేకాక 363 మంది రైతులకు సంబంధించి 808.39 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు చేరాయని, భూమి కోతకు గురైందని నివేదికలో పొందుపర్చారు. కానీ రైతుల జాబితాలో బాధితుల కంటే నకిలీలే అధికంగా ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. పరిహారం పొందిన వారిలో నలుగురికి పొలాలే లేకపోగా, ఒకే కుటుంబానికి చెందిన వారి పేర్లు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయి. ఇదే సమయాన పెదవాగు ఆనకట్ట దిగువన, ప్రాజెక్టు కిందే ఉన్న పొలాల యజమానులకు మాత్రం జాబితాలో చోటు దక్కలేదు. దీంతో అనర్హులకే పెద్ద పీట వేసినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'అధికార' ఒత్తిడే కారణమా..

పెదవాగు వరదతో నష్టపోయిన వారికి పరిహారం చెల్లింపులో భారీగా అక్రమాలు జరిగాయని తెలిసినా నేటికీ విచారణ ఊసెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది. పరిహారం జాబితాలో నకిలీలు, పొలాలు లేని వారి పేర్లు ఉండడం.. వీరంతా అధికార పార్టీ నేతలు కావడంతోనే విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. కాగా, పూర్తి స్థాయిలో విచారణ చేపడితే సర్వేను పర్యవేక్షించిన ఉద్యోగుల పాత్ర బయటపడుతుందని బాధిత రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో కలెక్టర్ మౌఖికంగా ఆదేశించిన నేపథ్యాన అధికారులు ఇకనైనా మౌనం వీడాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

అక్రమాలు, నకిలీల వివరాలు తెలియవు...



పెదవాగు వరద ముంపు సర్వే, పరిహారానికి అర్హుల జాబితా తయారీ నేను ఇక్కడకు రాక ముందే జరిగాయి. పరిహారం జాబితాను అప్పటి అధి కారులే కలెక్టర్‌కు సమర్పించారు. సర్వేలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు పరిహారం అందిందనే విషయం తెలియదు. అంతేకాక కలెక్టర్ విచారణకు ఆదేశించిన సమాచారం నాకు అందలేదు.

– రవికుమార్, ఏడీఏ, అశ్వారావుపేట



పెదవాగు వరదతో దెబ్బతిన్న పొలంలో రైతు (ఫైల్)

భద్రాద్రి ఆలయంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ప్రసాదాల తయారీ, ఇతర విభాగాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తనిఖీల కోసం లేఖ రాశారు. దీంతో అధికారులు ప్రసాదాల తయారీకి వినియోగించే సామగ్రి, లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించి శాంపిళ్లు సేకరించారు. తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, డీఈ రవీందర్, ఏఈఓ భవానీ రామకృష్ణ పాల్గొన్నారు.



శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

టెండర్ దరఖాస్తుల ఆహ్వానం

దేవస్థానం పరిధిలో వివిధ పనులు అప్పగించడంతో పాటు షాపుల కేటాయింపునకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. గౌతమీ క్యాంటీన్ నిర్వహణ, గోశాలకు పచ్చగడ్డి సరఫరా, దసరా మండపం వద్ద నర్సరీ నిర్వహణ, చెక్క బొమ్మలు, పూల విక్రయంతో పాటు దసరా మండపం, తాతగుడి సెంటర్, విస్తా కాంప్లెక్స్ తదితర కాంప్లెక్స్ ఖాళీ షాపులను టెండర్ల ద్వారా కేటాయిస్తామని వెల్లడించారు. ఈనెల 24న జరిగే టెండర్లలో ఆసక్తి ఉన్న పాల్గొనాలని సూచించారు.

సర్వీస్ నుంచి ఇల్లెందు ఎఫ్‌డీఓ తొలగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎఫ్
- అక్రమంగా అటవీ భూమి హద్దుల మార్పే కారణం

ఇల్లెందురూరల్: అవినీతికి పాల్పడడమే కాక విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో ఇల్లెందు ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్నను సర్వీస్ నుంచి తొలగిస్తూ అటవీశాఖ సీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. 2020లో ఇల్లెందు ఎఫ్ఆర్ఓగా వెంకన్న విధులు నిర్వర్తించిన సమయాన పూసపల్లి సమీపంలోని సర్వే నంబర్ 549/ఏ, 556, 557, 558/1 పరిధిలో ఉద్దేశపూర్వకంగా అటవీ భూభాగం సరిహద్దుల మార్పు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఫలితంగా అటవీశాఖకు చెందిన 33 హెక్టార్ల భూభాగం ఇతరుల పరమైంది. దీనికి తోడు వెంకన్నపై మరికొన్ని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం అధికారులు సమగ్ర వివరాలతో నివేదికను సీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్‌కు అందజేశారు. ఈమేరకు ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో ఇల్లెందు ఎఫ్‌డీవో వెంకన్నను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కర్నావత్ వెంకన్న

ఖమ్మం కోడలు బంగారం!

- చెస్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన ద్రోణవల్లి హారిక
- జిల్లా వాసి కార్తీక్‌తో 2018లో వివాహం

ఖమ్మం స్పోర్ట్స్: చదరంగంలో తిరుగులేని క్రీడాకారిణిగా ఎదిగిన ద్రోణవల్లి హారికకు జిల్లా క్రీడాకారులు, ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు పసిడి పతకాలు సొంతం చేసుకున్నాయి. అయితే, జట్ల విజయంలో కీలకంగా వ్యవహరించిన ద్రోణవల్లి హారిక ఖమ్మం కోడలే కావడంతో సోషల్ మీడియా వేదికగా అభినందనలు కురిపిస్తున్నారు. హారిక స్వస్థలం ఏపీలోని గుంటూరు జిల్లా కాగా, ఖమ్మంకు చెందిన చంద్ర వెంకటేశ్వర్లు కుమారుడు చంద్ర కార్తీక్‌తో 2018లో వివాహం జరిగింది. తొలినాళ్ల నుంచి అంతర్జాతీయ టోర్నీలపై దృష్టి సారించిన ఆమెకు 2022లో కుమార్తె జన్మించింది. అయినప్పటికీ భర్త, పాపతో కలిసి అంతర్జాతీయ టోర్నీలో పాల్గొంటూ నైపుణ్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటికే అర్జున, పద్మశ్రీ అవార్డులు అందుకున్న హారిక ఇప్పుడు చెస్ ఒలింపియాడ్‌లో సత్తా చాటడం విశేషం.



భర్త కార్తీక్, కుమార్తెతో హారిక

మార్క్‌ఫెడ్.. మజాకా!

మంత్రి తుమ్మల ఇలాఖాలో అధికారుల ఇష్టారాజ్యం

- వర్షాలతో దెబ్బతిన్న పెసల కొనుగోలుకు మంత్రి హామీ
- 12 శాతం తేమ, తాలు పేరిట నిరాకరిస్తున్న మార్క్‌ఫెడ్
- మార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. వర్షాలతో దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేస్తామని మంత్రి, జిల్లా అధికారులు హామీ ఇచ్చినా మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం తేమ, ఇతర కొర్రీలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు సరుకు చేజిక్కించుకుంటున్నారు. మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు చేపట్టకపోవడంతో గేట్లు మూసి ఆందోళనకు దిగారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు శ్రీకారం

క్వింటా పెసలకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.8,682 మద్దతు ధర ప్రకటించింది. కానీ ఖమ్మంలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకే చెల్లిస్తున్నారు. ఈ విషయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వెళ్లడంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ఇంతలోనే ఖమ్మంలో భారీ వర్షాలు, వరదలతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక ఈనెల 11నుంచి డీసీఎంఎస్ ద్వారా మార్క్‌ఫెడ్ ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలుపెట్టారు. కానీ ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన 4,246 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే.. ప్రైవేట్ వ్యాపారులు 2,689 క్వింటాళ్లు కొనుగోలు చేయడం గమనార్హం.

నిబంధనలతో ఆలస్యం

పెసల కొనుగోళ్లలో నిబంధనలతో రైతులు కుదేలవుతున్నారు. 12 శాతం తేమ ఉన్న పంటే కొనుగోలు చేసేలా నిబంధనలు ఉన్నాయి. ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలతో పంటలు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. మరోవైపు వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేసిన వారి నుంచే కొనుగోలు చేస్తామంటుండడంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు నమోదు చేసినా కొందరి వివరాలు పోర్టల్‌లో చూపకపోవడంతో సమస్య జఠిలమవుతోంది.



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

పడిగాపులు పడాల్సిందే..

పెసలు తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేస్తామని జిల్లాలో భారీ వర్షాలు, వరదల సందర్భంగా పర్యటించిన మంత్రులు, ప్రభుత్వ ప్రతినిధులు రైతులకు హామీ ఇచ్చారు. ఈమేరకు పెసలు తీసుకొస్తే మార్క్‌ఫెడ్ ఉద్యోగులు 12 శాతం తేమ ఉన్న పంటను రంగు, నాణ్యత ఆధారంగా కొనుగోలు చేస్తున్నారు. తీసుకొచ్చిన రోజు తేమ 12 శాతం ఉన్నా.. వరుస క్రమంలో మరుసటి రోజు పరిశీలించి నిరాకరిస్తున్నారని చెబుతున్నారు. అంతా బాగుందని చెప్పి కొనుగోలు చేసినా కాంటా పూర్తి కావడానికి నాలుగు రోజుల సమయం పడుతోంది.

మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన పెసలు	4,246 క్వింటాళ్లు
ఖమ్మం మార్కెట్‌లో..	2,269 క్వింటాళ్లు
వైరా మార్కెట్‌లో..	1,977 క్వింటాళ్లు
పెసలు విక్రయించిన రైతుల సంఖ్య	375
ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు	2,689 క్వింటాళ్లు
జిల్లాలో సాగు విస్తీర్ణం	14,334 ఎకరాలు

ఆందోళనకు దిగిన రైతులు..

ఖమ్మం మార్కెట్‌కు సుమారు 60మంది రైతులు సోమవారం పెసలతో రాగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన మధ్యాహ్నం వరకు కొనుగోలు చేయలేదు. సిబ్బంది తేమ శాతం పరీక్షిస్తారని చెబితే వేచి ఉన్నా ఫలితం లేక మార్కెట్ గేట్లు మూసేసి ఆందోళన చేశారు. చివరకు సంబంధిత అధికారులు సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే, ఖమ్మంలో వాతావరణం మేఘావృతం కావడంతో వర్షం పడితే పెసలు తడుస్తాయని పట్టాలు కప్పుకుని వేచి ఉన్నారు.



మార్కెట్ గేట్లు మూసేయగా రైతులు, మార్క్‌ఫెడ్ సిబ్బంది మధ్య వాగ్వాదం

క్లుప్తంగా

ప్రభుత్వ నిర్బంధం, అక్రమ కేసులు సరికాదు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

టేకులపల్లి: ప్రజా కళాకారులపై ప్రభుత్వం నిర్బంధం విధించడమే కాక అక్రమంగా కేసులు విధించడాన్ని మానుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కం కొండల్‌రావు, మెంతిని కొండల్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీలు తమ మనుగడ కోసం సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు. కాగా, సినిమారంగంలో మహిళలు, ఆదివాసీ, మైనారిటీ, దళితులపై అభ్యంతరకరమైన చిత్రీకరణలను సెన్సార్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు భూక్యా నర్సింగ్, వి.సురేశ్‌కుమార్, జోగి సుజాత, బి.లాలు, లింబా, కల్పన, మడివి సంధ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్-19 టీ.టీ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 25న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం కార్యదర్శి ఎం.డీ.ముసాఖలీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణపత్రాలతో ఉదయం 9గంటల్లోగా టేబుల్ టెన్నిస్ కోచ్ వీ.వీ.సాంబమూర్తిని సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 98484 08335 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు చివరి అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత విద్యాసంవత్సరం ఐటీఐల్లో చేరాలనుకునే వారికి ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 23నుండి 28 వరకు http//: iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. గతంలో దరఖాస్తు చేసినవారు మళ్లీ చేయాల్సిన పనిలేదని అధికారులు సూచించారు. కాగా, 14ఏళ్లు నిండిన వారు అర్హులని, సీట్ల భర్తీ ప్రతిభ ఆధారంగా ఉంటుందని తెలిపారు.

డీసీసీబీలో ఐదుగురు మేనేజర్లు బదిలీ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో ఐదుగురు మేనేజర్లను బదిలీ చేస్తూ సీఈఓ వసంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ బదిలీలు చేసినట్లు పేర్కొన్నారు. వాజేడు బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణను ఖమ్మం ప్రధాన కార్యాలయానికి, ఇక్కడ మేనేజర్ నాగేందర్‌ను వాజేడు బీఎంగా బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం ప్రధాన కార్యాలయంలోని మరో మేనేజర్ జె.కిషోర్‌ను సత్తుపల్లి బ్రాంచ్-1కు, సత్తుపల్లి బ్రాంచ్-1లో బీఎం స్రవంతిని కూసుమంచికి, కూసుమంచి బీఎం మంగయ్యను ఖమ్మం హెడ్డాఫీస్ బదిలీ చేశారు. అయితే, ఆకస్మికంగా జరిగిన బదిలీలపై బ్యాంక్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జూనియర్ కళాశాలలో డీఐఈఓ తనిఖీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. అధ్యాపకుల బోధన, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూస్తూ వార్షిక పరీక్షలతో పాటు పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించేలా సిద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శేషుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం సహాయనిధికి రూ.25లక్షల విరాళం


ఏపీ సీఎంకు చెక్కు అందిస్తున్న పంచాక్షరయ్య

బూర్గంపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ఏపీ ముఖ్యమంత్రి సహాయనిధికి తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25లక్షల విరాళం అందజేశారు. బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య సోమవారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేశారు. తన కుమారులైన ఎన్ఆర్ఐలు డాక్టర్ తాళ్లూరి రాజా శ్రీకృష్ణ, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ సౌజన్యంతో విరాళం అందజేసినట్లు వెల్లడించగా బూర్గంపాడు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావుతో పాటు వల్లూరిపల్లి వంశీకృష్ణ, తూము రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

తేలని హద్దులు.. తీరని బాధలు

- ఇల్లెందు మండలంలో అటవీ, రెవెన్యూ భూములపై స్పష్టత కరువు
- ఆక్రమణల్లో ప్రభుత్వ, అటవీ స్థలాలు
- రైతులకు అందని పాస్ పుస్తకాలు, సంక్షేమ పథకాలు


ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం

ఇల్లెందురూరల్: దశాబ్దాలుగా భూసమస్యలతో నలిగిపోతున్న ఇల్లెందు మండలంలోని అన్నదాతలకు గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూరికార్డుల శుద్ధీకరణ కూడా పరిష్కారం చూపలేకపోయింది. అటవీ, రెవెన్యూ శాఖలకు సంబంధించి భూములకు స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయకపోవడంతో వేలాది మంది రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకోలేకపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా తమ బాధలు ఆలకించి పరిష్కరిస్తుందేమోనన్న ఆశతో తొమ్మిది నెలలుగా అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

భూముల వివరాలివీ..

గత ప్రభుత్వ ఆదేశంతో క్షేత్రస్థాయి అధికారులు చేపట్టిన సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన ద్వారా మండలంలో భూముల వివరాలను అధికారులు అప్పట్లోనే అధికారంగా వెల్లడించారు. మండలంలో మొత్తం 98,677.18 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. అందులో పట్టా భూమి 17,523.35 ఎకరాలు కాగా ప్రభుత్వ భూమి 81,153.23 ఎకరాలుగా నమోదైంది. ప్రభుత్వ భూమిలో 61,831.16 ఎకరాలు అటవీభూమిగా నిర్ధారించారు. ఇక మిగిలిన ప్రభుత్వ భూమి 19,322 ఎకరాలుగా నమోదైంది.

ఎక్కడ ఉన్నాయో.. ఏమో?

మండలంలోని మొత్తం ప్రభుత్వ భూమి 19,322 ఎకరాలు. ప్రభుత్వ సంబంధిత నిర్మాణాలకు, అసైన్‌మెంట్‌కు కేటాయించని భూములు, ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన భూములు పోను మొత్తంగా వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1417.15 ఎకరాలు వ్యవసాయానికి పనికి రాని భూమి, 4075.23 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయేతర భ్రష్టు భూమి ఖాళీగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. కానీ, నేడు ఏ ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థ నిర్మించాలన్నా, పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నా సెంట్ స్థలం లేదని అధికారుల నుంచి సమాధానం వస్తోంది. ఈ కారణంగానే మైనారిటీ, బీసీ, ఎస్సీ గురుకులాల భవనాలకు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా స్థలం కేటాయించకపోవడం సమస్య తీవ్రతను బహిర్గతం చేస్తోంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా హెచ్చరిక బోర్డులు పెట్టడం మినహా ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి.

సరిహద్దు సమస్యతో..

మండలంలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్య రైతుల పాలిట శాపంగా పరిణమిస్తోంది. గతంలో భూరికార్డుల శుద్ధీకరణ సమయంలో సర్వే చేసిన అధికారులు సైతం సరిహద్దులపై స్పష్టత ఇవ్వలేకపోయారు. కనీసం రెండు శాఖల అధికారులు జాయింట్ సర్వే చేసినా సమస్యకు పరిష్కారం చూపలేదు. ఫలితంగా వందల సంఖ్యలో రైతులు అర్హత ఉన్నా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందలేకపోయారు. రాఘబోయినగూడెం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 131లో ఉన్న 4 వేల ఎకరాల్లో అత్యధిక భాగంలోని భూమిపై అటవీ, రెవెన్యూ అధికారులకు స్పష్టత కొరవడింది. దీంతో సర్వే సమయంలో కేవలం 800 ఎకరాలకు మాత్రమే పాస్‌పుస్తకాలు అందజేశారు. రొంపేడు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 588లో మొత్తం 22 వేల ఎకరాలు ఉండగా అందులో అటవీ భూమి 14 వేల ఎకరాలు, సింగరేణికి సంబంధించి 165 ఎకరాలు, మిగతాది రెవెన్యూ భూమిగా నమోదైంది. కానీ, సరిహద్దుల్లో స్పష్టత లేకున్నా అటవీభూమిగా నిర్ధారించి గతంలో అధికారులు మంజూరు చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేశారు. ఇదే తరహాలో కొమరారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 320, రాజీవ్‌నగర్‌తండా సమీపంలోని సర్వే నంబర్ 549లోనూ రైతులు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిక్కుముడి వీడేదెన్నడు..

మండలంలోని మామిడిగుండాల, ధనియాలపాడు పంచాయతీల పరిధిలోని సర్వే నంబర్ 130 పరిధిలో మొత్తం 4,209 ఎకరాల భూమి ఉంది. ఇందులో సీలింగ్ యాక్ట్ నిబంధనల మేరకు సుమారు 40 ఏళ్ల కిందట స్థానిక గిరిజనులకు సీలింగ్ పట్టాలు పంపిణీ చేశారు. మూడేళ్ల కిందట రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కానీ నేటికీ రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయలేదు. ఫలితంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు రైతులు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా పాలకులు, యంత్రాంగం స్పందించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

సీఎంఆర్ అమ్ముకున్న మిల్లు యజమాని

పోలీసులకు ఫిర్యాదు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు


మిల్లులో పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధి శివలింగాపురంలోని శ్రీ సాయి ప్యాడీ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ మిల్లు యజమానిపై సోమవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయీస్ డీటీ శివకుమార్ తెలిపిన వివరాలు... మిల్లుకు ప్రభుత్వం 2022-23లో సుమారు రూ.4.88 కోట్ల విలువైన ధాన్యాన్ని కేటాయించగా బియ్యం(సీఎంఆర్)గా మార్చి ఎఫ్‌సీఐకి అందించాల్సి ఉంది. కానీ యజమాని బొలిశెట్టి విజయభాస్కర్ ఆనందరావు బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నాడు. ఈ విషయమై ప్రభుత్వానికి డబ్బు చెల్లించాలని పలుమార్లు షోకాజు నోటీసులు ఇచ్చినా స్పందన రాలేదు. దీంతో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం కమల్ పాషా, ఎస్‌ఐలు పుల్లయ్య, స్వామిదాస్ మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డితో కలిసి సోమవారం మిల్లులో తనిఖీ చేశాక క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


రికార్డులు పరిశీలిస్తున్న మహువా త్రిపాఠి

ములకలపల్లి: మహిళలు నైపుణ్యాలు పెంచుకుంటూ అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఢిల్లీకి చెందిన యాక్సిస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ మహువా త్రిపాఠి సూచించారు. మండలంలోని మూకమామిడి ఆయిల్‌ఫామ్ సొసైటీని సోమవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా సొసైటీ ఆధ్వర్యాన చేపడుతున్న పనులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం కోళ్లఫారాలు, కుట్టుమిషన్ యూనిట్లు, డెయిరీ ఫాంలు ఏర్పాటుచేయాలని తెలిపారు. సంస్థ ఏపీ - తెలంగాణ ప్రాజెక్ట్ అధికారి సుబ్బారావుతో పాటు విజయ్, రవికుమార్, కీసరి లక్ష్మి, చిలకపాటి జైచందర్‌రావు, మేకల పెద్దవెంకన్న, కరుటూరి కృష్ణ, పుల్లూరి వేణుగోపాల్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

జెన్‌కో నేతృత్వాన నిర్మించాలి


సీఈకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

మణుగూరు రూరల్: రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్‌ను జెన్‌కో ఆధ్వర్యానే నిర్మించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సోమవారం మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు బి.రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణలో జెన్‌కో ఇంజనీర్లకు అనుభవం ఉందన్నారు. ఈమేరకు జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యాన నిర్మించాలనే యోచన వెనక్కి తీసుకోవాలని కోరారు. అంతేకాక కేటీపీఎస్‌లో 1,600మెగా వాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు, కేటీపీపీలో 800మెగావాట్ల సామర్థ్యంతో మరో యూనిట్‌ను జెన్‌కో ఆధ్వర్యాన నిర్మించాలన్నారు. నాయకులు సీహెచ్.రాజబాబు, రవితేజ, సాయి, రాము, ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించాలి

టేకులపల్లి: రేషన్ డీలర్లకు కమీషన్ పెంచడమే కాకుండా గౌరవ వేతనం చెల్లించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊకె శేఖర్‌రావు కోరారు. ఈసందర్భంగా సోమవారం ఇల్లెందుకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీలర్లకు న్యాయం చేయాలని కోరారు. సంఘం బాధ్యులు ఎల్.దేవ్‌సింగ్, ఏ.రామా, బాలు, ఆంగోతు సంతులాల్, ఎల్.చందర్, బి.వెంకన్న, జి.హేమచంద్ర, జి.కల్యాణ్, బి.బాలు, ధరావత్ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, కలెక్టర్‌ను కలిసిన ప్రేమ్‌లాల్

టేకులపల్లి మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ టీజీటీ హిందీ టీచర్‌గా పనిచేస్తున్న తనను అకారణంగా తొలగించారని ఇటీవల వెల్లడించిన దివ్యాంగుడు వాంకుడోత్ ప్రేమ్‌లాల్ సోమవారం ఇల్లెందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేశారు. దీంతో పక్కనే ఉన్న ఐటీడీఏ పీఓను పిలిచి సమస్య పరిష్కరించాలని మంత్రి సూచించారు.

ముంపు పరిహారం అందించాలని ధర్నా

ఖాతాల్లో జమ అవుతుందని చెప్పడంతో బారులు


వరద బాధితులకు నచ్చచెబుతున్న అధికారులు

మణుగూరు టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌తో పాటు సమీప గ్రామాలు ముంపు బారిన పడడానికి సింగరేణి నుంచి వచ్చిన వరదే కారణమంటూ ప్రజలు సోమవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సింగరేణి ఓసీల ప్రాంతం నుంచి వచ్చిన వరద కారణంగా సుందరయ్యనగర్‌లో ముంపునకు గురైన ప్రతీ ఇంటికి పరిహారం అందించాలని ఆధార్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు అందించారు. అయితే, అధికారులు బ్యాంకు ఖాతా జిరాక్సులు ఎందుకు తెచ్చారని తీయగా ఓ వ్యక్తి పరిహారం జమ చేస్తారని చెప్పినట్లు వెల్లడించడంతో అవాక్కయ్యారు. ఈమేరకు భారీ వర్షంతోనే వరద వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని నచ్చచెప్పారు.

ఇల్లెందు ఆస్పత్రిలో ఒకేరోజు ఐదు ప్రసవాలు


ఆస్పత్రిలో జన్మించిన శిశువులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో మూడు గంటల్లో ఐదు ప్రసవాలు చేశారు. ఇల్లెందు ఆస్పత్రి గైనకాలజిస్ట్ సింధు సోమవారం కాన్పులు నిర్వహించగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఇందులో ముగ్గురు గర్భిణులకు రెండో కాన్పు కాగా, సాధారణ ప్రసవాలు జరిగే పరిస్థితి లేక శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ సింధును ఆస్పత్రి సూపరింటెండెంట్ హర్షవర్ధన్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు అభినందించారు. కాగా, శస్త్రచికిత్సల్లో అనస్తీషియన్ అజర్‌బాబు, సీనియర్ హెడ్ నర్స్ ఫర్హానా తదితరులు పాలుపంచుకున్నారు.

ఇసుక లారీ స్వాధీనం

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మొర్రేడు వాగు నుండి ఇసుకను లోడ్ చేసుకుని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ సుమన్ దమ్మపేట రోడ్డులో అడ్డుకున్నారు. లారీని సీజ్ చేయడమే కాక డ్రైవర్ రాంబాబుపై కేసు నమోదు చేశారు.

గణపతి లడ్డూ రూ.1.45లక్షలు!

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని అశోక్‌నగర్ కాలనీలో పవర్ బాయ్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో లడ్డూను సోమవారం రాత్రి వేలం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు పోటీపడగా పిల్లి కల్యాణ్ రూ.1,45,500కు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరుకాగా, గణనాథుడిని శోభాయాత్రకు నిమజ్జనానికి తీసుకెళ్లారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

తీవ్రగాయాలతో క్లీనర్ మృతి


క్లీనర్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

వైరా: ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాన్ ఢీకొనడంతో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వైరా పోలీస్‌స్టేషన్ సమీపాన సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదం వివరాలు... వ్యాన్ డ్రైవర్ వేముల నవీన్, మరో డ్రైవర్ వేముల నర్సింహారావు, క్లీనర్ తమ్మిశెట్టి గోపి(20) ఖమ్మంలో కోళ్లను దిగుమతి చేసి సోమవారం తెల్లవారుజామున తల్లాడ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో పోలీస్‌స్టేషన్ సమీపాన ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా వ్యాన్ భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. క్లీనర్ గోపి కేబిన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందగా, డ్రైవర్ వేముల నర్సింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు క్లీనర్ గోపి మృతదేహాన్ని పోలీసులు, స్థానికులు బయటకు తీశారు. ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వేటగాళ్ల చేతిలో జాతీయ పక్షుల హతం?

రాజేశ్వరపురంలోని తోటలో అవశేషాలు


రాజేశ్వరపురంలో కనిపించిన నెమళ్ల అవశేషాలు

నేలకొండపల్లి: జాతీయ పక్షి అయిన నెమలి పురివిప్పి ఆడుతుంటే చూడడానికి అందంగా ఉంటుంది. పొలాల్లో ఇవి స్వేచ్ఛగా విహరిస్తుండడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వధించి మాంసం అమ్ముతున్నారని తెలుస్తోంది. మండలంలోని రాజేశ్వరపురంలో ఓ చెరుకు తోటలో కొంతకాలంగా నెమళ్లు తిరుగుతున్నాయి. వీటిని పసిగట్టిన వేటగాళ్లు చంపేశారనే ప్రచారం జరుగుతోంది. సోమవారం రైతులు పొలా వైపు వెళ్లగా చెరుకు తోట ఎదురుగా కాల్వ కట్ట వద్ద నెమళ్ల ఈకలు, కాళ్లు కనిపించాయి. దీంతో వ్యర్థాలను తొలగించి మాంసం తీసుకెళ్లి ఉంటారని భావిస్తున్నారు. గతంలో సింగారెడ్డిపాలెంలోని కొరటీనా(గుట్ట)పై నెమళ్లు సంచరించేవని, ఇప్పుడు అక్కడ రహదారి కోసం గుట్ట మట్టి తవ్వే క్రమంలో నెమళ్లు రాజేశ్వరపురం చెరుకు తోటల వైపు వెళ్లి ఉంటాయని చెబుతున్నారు. ఈక్రమంలోనే ఓ రైతుకు చెందిన చెరుకు తోటలో కొన్నాళ్లుగా నెమళ్లు తిరుగుతుండగా, ఇప్పుడు వాటిని గుర్తుతెలియని వ్యక్తులు వధించినట్లు తెలుస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

పార్టీని బలోపేతం చేయాలి..


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రంగాకిరణ్

దమ్మపేట: బీజేపీని జిల్లావ్యాప్తంగా బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ సూచించారు. దమ్మపేటలో ఏర్పాటుచేసినర్రాత్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాయకులు సభ్యత్వాలు నమోదు చేయిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాస్, కొలికపోగు ముసలయ్య, పసుమర్తి పుల్లారావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దొంగల భయంతో కాపలా

తాళ్లగూడెంలో గస్తీ కాస్తున్న యువకులు


కాపలా కాస్తున్న యువకులు

కామేపల్లి: ఊరిలో పోలీస్‌స్టేషన్ ఉంది.. అయినా దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాళ్లగూడెంలో చోరీలు జరుగుతుండడంతో దొంగల చేతిలో ఇనుపరాడ్లు, కత్తులు ఉన్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దీంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియక ఎవరి ఇంట్లో చోరీ జరుగుతుందోనన్న ఆవేదనతో గ్రామస్తులు కాపలా కాస్తూ జాగారం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకునే వరకు ఇళ్లలో ప్రశాంతంగా నిద్రించే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. దీంతో యువకులు బృందాలుగా ఏర్పడి వంతుల వారీగా గస్తీ కాస్తున్నారు.

ఉపాధ్యాయురాలి మృతికి సంతాపం

మణుగూరు రూరల్: దుమ్ముగూడెం మండలం చిన్న నల్లబెల్లికి చెందిన పీజీటీ పూసం గిరిజావేణి మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. మణుగూరు టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ వి.రాణి, ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సంతాప సభలో గిరిజావేణి చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ జె.సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎస్.ప్రతిభ, ఐ.వసంత, వై.నాగేశ్వరరావు, టి.అనసూర్య, పి.నిఖిత పాల్గొన్నారు.

రూ.2కోట్ల విలువైన గంజాయి స్వాధీనం!

భద్రాచలం: భద్రాచలంలో ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు సుమారు రూ.2కోట్ల విలువైన ఐదు క్వింటాళ్ల గంజాయితో పాటుగా తరలిస్తున్న వాహనాలు, వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా సమాచారం. ఇందుకు సంబంధించి వివరాలను అధికారులు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

సీతారామ కెనాల్‌లో మృతదేహం

అశ్వాపురం: మండలంలోని అమెర్ద కాలనీలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీతారామ కెనాల్‌లో చేపలు పడుతున్న జాలర్లు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అశోక్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించగా అదే గ్రామానికి చెందిన యాసా నవీన్(39)గాగుర్తించారు. అయితే, ఆయన ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడ్డాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా తెలియాల్సి ఉంటుంది. నవీన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా కుటుంబ తగాదాలతో వారు దూరంగా నివసిస్తున్నారు.

మాజీ సర్పంచ్ భర్త హత్య?

గొత్తికోయలే చంపారని కుటుంబీకుల ఫిర్యాదు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గంగ్రబంధంలో నివాసముంటున్న బంగారుచెలక మాజీ సర్పంచ్ తాటి రాధ భర్త తాటి వెంకటేశ్వర్లును గొత్తికోయలు కొట్టి చంపారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గంగ్రబంధంకు చెందిన తాటి వెంకటేశ్వర్లు(50) పొలంలో కోతుల బెడద ఉండడంతో ప్రతిరోజు కుక్కతో గుత్తి కోయ గుంపు మీదుగా వెళ్లి కుక్కను అక్కడ వదిలేసి తిరిగి వస్తాడు. అయితే, ఆయన సోమవారం పొలానికి వెళ్లినా రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి పరిశీలించినా ఆచూకీ తెలియరాలేదు. చివరకు గొత్తికోయ గుంపునకు సంబంధించి వారు వెంకటేశ్వర్లు మృతి చెందాడని సమాచారం ఇచ్చారు. ఈమేరకు కుటుంబీకులు వెళ్లి చూశాక ఆయనను గొత్తికోయలే కొట్టి చంపారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఆయన నుదుటి పైభాగంలో గాయాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ నేతలు నన్ను అభినందిస్తున్నారు

- అమృత్ కుంభకోణం బయట పెట్టినందుకు మెసేజ్‌లు వస్తున్నాయి
- 'అమృత్'అంశంలో రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కు బయటపడింది
- సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- 'ఎక్స్'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అమృత్ టెండర్లలో రేవంత్‌రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల నుంచి తనకు అభినందన సందేశాలు వచ్చినట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి అక్రమాలపై బీజేపీ నేతల మౌనం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు వెళ్లిన పార్టీ అధ్యయన బృందం సభ్యులను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసంక్షేమం కోసమే స్వయంగా డాక్టర్లతో కూడిన తమ పార్టీ ప్రతినిధి బృందం ఆస్పత్రులను సందర్శిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని పిరికిపంద చర్యలకు పాల్పడినా, ప్రజారోగ్య వ్యవస్థ లోపాలను ఎత్తిచూపుతామని ప్రకటించారు. ప్రభుత్వం నిజాలు దాచని పక్షంలో బీఆర్‌ఎస్ నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పట్టణ పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 400కు పైగా బస్తీ దవాఖానాలను నడపడం రేవంత్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. ఓ వైపు విష జ్వరాలతో నగరవాసులు నరక యాతన పడుతుంటే, అసమర్థ పాలనలో ఆదుకోవాల్సిన బస్తీ దవాఖానాలకే సుస్తీ చేసిందన్నారు.

కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం చేసే ప్రయత్నం చేశారని, సంఘటన వివరాలు, సునీతాలక్ష్మారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీతాలక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేమనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎన్ని అరాచకాలకు పాల్పడినా, 60 లక్షల మంది కేడర్ కలిగిన బీఆర్‌ఎస్ కుటుంబం ప్రతీ ఒక్కరికి అండగా ఉంటుందన్నారు.

ఆ నెయ్యి వాడలేదు..

- చంద్రబాబును అడ్డంగా బుక్ చేసిన లోకేశ్
- తండ్రి చెప్పిన దానికి భిన్నంగా తనయుడి ట్వీట్

సాక్షి, అమరావతి: ఆ వెంకటేశ్వరస్వామే తనతో నిజాలు చెప్పించారేమో అని చెబుతున్న సీఎం చంద్రబాబు తన తనయుడు నారా లోకేశ్ వ్యాఖ్యలతో అడ్డంగా దొరికిపోయారు!

శ్రీవారి సాక్షిగా తండ్రీ కుమారుడు తమ బండారాన్ని తామే బయటపెట్టుకున్నారు!!

టీటీడీ లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి విషయంలో చంద్రబాబు చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా లోకేశ్ సోమవారం ఎక్స్‌లో ట్వీట్ చేయడంతో టీడీపీ శ్రేణులు కంగుతిన్నాయి. జంతువుల కొవ్వు కలిపిన ఏఆర్ డెయిరీ నెయ్యిని లడ్డూల తయారీకి ఉపయోగించారని, వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెప్పి నమ్మించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. కానీ లోకేష్ మాత్రం తాజాగా ట్వీట్‌లో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి లారీలు నాలుగింటినీ టీటీడీ తిప్పి పంపించేసిందని వెల్లడించి సీఎం స్థానంలో కూర్చున్న తన తండ్రి వచ్చి అబద్ధాల కోరని నిరూపించారు. నాలుగు నెయ్యి లారీలను తిప్పి పంపిన టీటీడీ రిపోర్టును తన ట్వీట్‌కు జత చేశారు. అందులో ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన 8 నెయ్యి ట్యాంకర్లలో నాలుగు టెస్టుల్లో పాసవగా, నాలుగు ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు స్పష్టంగా పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పేది నిజమా? లేక లోకేష్ చెప్పేది నిజమా? అబద్ధాలు చెప్పడంలో ఇద్దరి మధ్యా సమన్వయం లేదా? కుమారుడికి అబద్ధాల ట్రెయినింగ్ సరిగా ఇవ్వలేదా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది.

జూన్ 12న తొలి ట్యాంకర్ టీటీడీకి

లోకేష్ చేసిన ట్వీట్‌ను బట్టి ఏఆర్ డెయిరీ నెయ్యి సరఫరా చేయడం ప్రారంభించింది చంద్రబాబు సీఎం పీఠం ఎక్కిన రోజు నుంచేనని స్పష్టమైంది. జూన్ 12వ తేదీన ఏఆర్ డెయిరీ నుంచి తొలి ట్యాంకర్ టీటీడీకి చేరింది. అదే నెల 21, 25న రెండు, జూలై 4వ తేదీన మరో ట్యాంకర్ వచ్చాయి. మొత్తం నాలుగు నెయ్యి ట్యాంకర్లు టీటీడీ నిర్వహించిన పరీక్షల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉన్నాయని తేలింది. అందుకే వాటిని స్వీకరించారు. ఆ తర్వాత జులై 6వ తేదీన వచ్చిన రెండు ట్యాంకర్లు, 12న వచ్చిన మరో రెండు ట్యాంకర్లు ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో టీటీడీ వాటిని తిరస్కరించింది. లోకేష్ జత చేసిన రిపోర్టులో ఈ విషయం స్పష్టంగా ఉంది. లేబొరేటరీ పరీక్షల్లో ఈ నాలుగు ట్యాంకర్లను తిరస్కరించారంటే అందులోని నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగించలేదని విస్పష్టంగా తెలుస్తోంది. కానీ చంద్రబాబు ఆ నెయ్యిని వాడేసినట్లు, వాటితో తయారైన లడ్డూలను భక్తులను తినేసినట్లు చెబుతూ జనాన్ని తప్పుదోవ పట్టించారు. ఆయన కుమారుడు మాత్రం అది తప్పని, ఆ నెయ్యిని వాడలేదని, భక్తులు తినలేదని అసలు విషయాన్ని బయటపెట్టి తమది పక్కా రాజకీయమని తేల్చేశారు.

బాబు గద్దెనెక్కిన రోజు నుంచే సరఫరా

ఈ ఏడాది మార్చి 12వ తేదీన కేజీ రూ.319.20 చొప్పున 10 వేల టన్నుల నెయ్యి సరఫరా కోసం టీటీడీ టెండర్లు పిలిచింది. మే 8వ తేదీన టెండర్లు ఖరారై ఏఆర్ డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కింది. టెండర్లు పిలిచి ఖరారు చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అయినా సరఫరా ప్రారంభమైంది మాత్రం టీడీపీ హయాంలోనే. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే ఏఆర్ డెయిరీ నెయ్యి టీటీడీకి రావడం మొదలైంది. అప్పుడు కూడా ఆ నెయ్యిని మూడుసార్లు పరీక్షించి ప్రమాణాల ప్రకారం లేని ట్యాంకర్లను వెనక్కి పంపేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టిన చంద్రబాబు కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆ నెయ్యిని వాడేశారని, వాటితో లడ్డూలు తయారు చేసేశారని, వాటిని భక్తులు తినేశారని, దీనికి జగనే కారణమని అబద్ధాలు చెబుతూ దేవుడి సాక్షిగా నమ్మక ద్రోహానికి పాల్పడ్డారు. ఈ విషయం లోకేష్ ట్వీట్ ద్వారా బయటపడడం గమనించాల్సిన విషయం. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి ఇష్టం వచ్చినట్లు అడ్డగోలు భాషలో అడ్డంగా మాట్లాడే క్రమంలో లోకేష్ మరోసారి తాను పప్పునని బయటపెట్టుకున్నారు. వైఎస్ జగన్‌ను ఉద్దేశించి కొవ్వు ఎక్కువైందంటూ అధికారం అండతో అహంకారంతో అభ్యంతరకరమైన పద జాలాన్ని ఉపయోగించిన లోకేష్ అదే ట్వీట్‌లో తమ బాగోతాన్ని బహిర్గతం చేశారు. శ్రీవారి జోలికి వెళ్లి చేయకూడని చెత్త రాజకీయాలన్నీ చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు అయన కుమారుడికి దేవుడి కోర్టులోనూ, ప్రజా కోర్టులోనూ శిక్ష పడడం ఖాయమని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.


Lokesh Nara
@naralokesh

అధికారం అండగా ఉందనే అహంకారంతో కొవ్వు ఎక్కువైన జగన్ కమీషన్ల కక్కుర్తితో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కల్తీ పనులు చేశారు. అడ్డంగా దొరికిపోయేసరికి ఫేక్ జగన్ తన ఫేక్ ముఠాలను దించి తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారు. జంతువుల కొవ్వు కలిసిన నీ ఏఆర్ డెయిరీ నెయ్యి లారీలు 4 టీటీడీ తిప్పి పంపింది. అదే ఈ రిపోర్టు చెబుతోంది. ఇదే సీఎం, ఈవో చెప్పారు. నీ పాపం పండింది @ysjagan. శ్రీవారి జోలికి వెళ్లావ్.. చేయకూడని పనులన్నీ చేశావ్.. ఇప్పటికే నీకు ప్రజా కోర్టులో శిక్ష పడింది. ఇక న్యాయస్థానం, దేవుడి కోర్టులో శిక్షలకు రెడీగా ఉండు..

#YCPAnimalFatInTirumalaLaddu
#AndhraPradesh
#FekuJagan
Translate post

నెయ్యిపై నిగ్గు తేల్చండి

▶ మొదటి పేజీ తరువాయి

తిరస్కరించిన నెయ్యిలో అది ఉందా? ఆ నివేదిక వెనుక రాజకీయ పార్టీల దురుద్దేశాలున్నాయా? అనే విషయాలను కోర్టు తేల్చాల్సిన అవసరం ఉందని స్వామి తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు.

ఈ ప్రశ్నలపై కమిటీ దృష్టి సారించాలి...

'21.06.2024న టీటీడీ ఈవో మంచి నాణ్యమైన నెయ్యితో శాంపిల్ లడ్డూలు తయారు చేయాలని దేవస్థానం కార్మికులకు చెప్పారు. 17.7.2024న ల్యాబ్‌కు నెయ్యి నమూనాలు ఇచ్చారు. నెయ్యి నాణ్యతపై ల్యాబ్ ఇచ్చిన నివేదికను చూస్తే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై కమిటీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అసలు పరీక్షకు ఏ నెయ్యిని ఉపయోగించారు? ప్రసాదాలకు ఉపయోగించిన నెయ్యినా? లేక తిరస్కరించిన లాట్‌లోని నెయ్యినా? కల్తీ నెయ్యి సేకరణకు ఏ సరఫరాదారు బాధ్యులు? ఆ నివేదికలో పేర్కొన్న విధంగా ఆ నివేదిక తప్పయ్యే అవకాశం ఉందా? టీటీడీ అంతర్గత పరీశీలన తరువాత నెయ్యిని ఎప్పుడు సేకరించారు? ఎప్పుడు దాన్ని వెనక్కి పంపారు? ఆ నివేదిక విషయంలో రాజకీయ జోక్యం ఏదైనా ఉందా?' అనే అంశాలను స్వామి తన పిటిషన్‌లో ప్రస్తావించారు.

నాణ్యత ఉన్న నెయ్యి ట్యాంకర్లకే అనుమతి...

'తిరుమలలో ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్‌పీవో) ప్రకారం దేవస్థానం ప్రాంగణంలోకి ఆవు నెయ్యి వాహన ట్యాంక్ ప్రవేశించిన వెంటనే సంబంధిత అధికారులు ఆ నెయ్యి నమూనాలను తీసుకుని మౌలిక పరీక్షలు నిర్వహిస్తారు. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యతకు అనుగుణంగా ఆ నెయ్యి నమూనాలు ఉన్నట్లు ఆ పరీక్షల్లో తేలితేనే ఆ నెయ్యిని శ్రీవారి లడ్డూతో సహా అన్ని ప్రసాదాల్లో వినియోగించేందుకు వాడతారు. పరీక్షల్లో విఫలమైన నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపేస్తారు. ఇందులో ఎలాంటి రాజీ ఉండదు. దశాబ్దాలుగా ఈ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. అందువల్ల కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించారన్నది అవాస్తవం. 'ద ప్రింట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో టీటీడీ ఈవో ఆ నెయ్యిని 100 శాతం ఉపయోగించలేదని స్పష్టంగా చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా లడ్డూ విషయంలో తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు భక్తులను తీవ్రంగా ప్రభావితం చేశాయి' అని స్వామి నివేదించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం ప్రకటనలు...

'కొందరు వ్యక్తులు ఓ చిన్న కాగితంలోని కొంత సమాచారాన్ని పట్టుకుని దాని ఆధారంగా రాజకీయ ప్రకటనలు చేశారు. వాస్తవానికి దేని ఆధారంగా అయితే వారు రాజకీయ ప్రకటనలు చేశారో అది ప్రజా బాహుళ్యంలో లేదు. దీనిపై తీవ్ర రాజకీయ ప్రతిఘటన మొదలైంది. వెంకటేశ్వరస్వామిని కొలిచే కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. అతి సున్నితమైన విషయాన్ని ఉద్దేశపూర్వకంగా మీడియాకు లీకు చేసి దానిపై రాద్ధాంతం మొదలుపెట్టారు. ఆ సమాచారాన్ని బహిర్గతం చేసిన వ్యక్తులు అలా చేయడానికి ముందు దాన్ని టీటీడీ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చి వాస్తవాలను నిర్ధారించుకోవాల్సింది. అయితే అలా చేయకుండా రాజకీయ ప్రయోజనం కోసం ప్రకటనలు చేయడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో మొత్తం వ్యవహారంలో జోక్యం చేసుకోవాలి' అని సుబ్రమణియన్ స్వామి తన పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు.

స్వతంత్ర విచారణ జరిపించండి

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించండి
- లోతైన విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల లడ్డూ వ్యవహారంలో స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈమేరకు వైవీ సుబ్బారెడ్డి తరుపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. లడ్డూకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ల్యాబ్‌పై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అందులో కోరారు. ఆ నివేదికలో పేర్కొన్న నెయ్యిని ఎక్కడ నుంచి సేకరించారన్న దానిపై కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అభ్యర్థించారు. లడ్డూపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న నేపథ్యంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ వ్యవహారాన్ని ప్రచారం చేయడం గానీ, ప్రచురించడం గానీ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, టీటీడీ ఈవోలతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్స్, వనస్పతి ఉన్నట్లు ఈ ఏడాది జూలై 23న ఈవో చెప్పారని నివేదించారు. రెండు నెలల తరువాత సీఎం చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ఈవో చెప్పిన దానికి భిన్నంగా జంతు కొవ్వులు ఉన్నట్లు చెబుతూ భక్త సమాజంలో తీవ్ర ఆందోళన రేకెత్తించారన్నారు. ఈవో, ముఖ్యమంత్రి చెప్పిన మాటలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నివేదికపై ఆధారపడి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలు చేశారో అందులోనే తమ నివేదిక తప్పయ్యే అవకాశం కూడా ఉన్నట్లు స్పష్టంగా పేర్కొన్నారన్నారు.

తిరుమల పవిత్రత దెబ్బ తీయకండి..

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ లబ్ధికోసం తిరుమల ప్రతిష్టను, పవిత్రతను దెబ్బతియ్యొద్దని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారి లడ్డూపై ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధించాయన్నారు. శ్రీవారి ప్రసాదంలో కల్తీ చేయాలని టెర్రరిస్టులు కూడా ఆలోచన చేయరన్నారు. ఇక్కడి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పుత్తా ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. కేవలం రాజకీయం కోసమే చంద్రబాబు విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారం మంచిది కాదని హితవు పలికారు. మహానేత రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనూ ఇదే తరహాలో నిందలు వేశారని శ్రీకాంత్‌రెడ్డి గుర్తుచేశారు. తిరుమలలో కూడా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని ఒక వ్యక్తి పిటిషన్ వేసిన సమయంలో కోర్టుకు సమాధానం ఇవ్వడంలో భాగంగా 27 చదరపు కిలోమీటర్ల వరకు హోలీసిటీ ఉండాలని, రాజకీయాలు ఉండొద్దన్న ఉద్దేశంతో వైఎస్ జీఓ ఇస్తే దానికి వక్రభాష్య చెబుతూ రెండుకొండలు చేశారంటూ నానాయాగీ చేశారన్నారు.

జిల్లా వార్తలు

లాభాల వాటాలో ప్రభుత్వ తీరు సరికాదు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాపై రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆరోపించారు. నికర లాభం రూ.4,701 కోట్లలో 33శాతం వాటా ఇవ్వడమేకాక సింగరేణిపై రాజకీయ జోక్యాన్ని తగ్గించాలనే డిమాండ్‌తో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రూ.4,701 నికర లాభం ప్రకటించి రూ.2,289 కోట్లను అభివృద్ధి పేరిట పక్కన పెట్టి మిగతా లాభంలో వాటా ఇవ్వడం గర్హనీయమన్నారు. అలాకాకుండా మొత్తం లాభంలో కార్మికులకు వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు తుమ్మ శ్రీనివాస్, బాదావత్ శాంతి, తొగరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

29న పీఎల్‌ఆర్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కోల్ ఇండియా పరిధిలో పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ సమావేశం ఈనెల 29న న్యూఢిల్లీలో జరగనుంది. బొగ్గు గని కార్మికులకు దీపావళి బోనస్‌గా గత ఏడాది రూ.85,500 చొప్పున చెల్లించారు. కాగా, ఈ ఏడాది అంత కంటే మెరుగ్గా సాధిస్తామని బీఎంఎస్ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నుండి సుధీర్‌గరుడే, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి మజ్రుల్ అక్యు అన్సారి, సింగరేణి నుండి యాదగిరి పాల్గొననున్నారని వెల్లడించారు.

పర్ణశాల ఆలయంలో సంప్రోక్షణ

దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం అర్చకులు సంప్రోక్షణ నిర్వహించారు.పర్ణశాల గ్రామంలోని ఆలయం సమీపాన నివాసముండే ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఆలయాన్ని కొన్ని గంటల పాటు మూసేసి సంప్రోక్షణ, స్వామి వారికి అభిషేకాలు చేశాక భక్తులను దర్శనానికి అనుమతించారు.

ఇద్దరు మావోలు, ఒక కొరియర్ అరెస్టు

ఒకరిపై రూ.20 లక్షల రివార్డు

- పదుల సంఖ్యలో హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్షపాత్ర
- వరంగల్‌లో వైద్యం చేయించుకుని వస్తూ పట్టుబడిన వైనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, పక్కన అధికారులు

కొత్తగూడెంటౌన్: ఇద్దరు మావోయిస్టులతో పాటు ఒక మహిళా కొరియర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇందులో ఒక మావోయిస్టుపై రూ.20 లక్షల రివార్డు ఉంది. ఈ మేరకు కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్ రాజు వివరాలు వెల్లడించారు. చర్ల పోలీసుస్టేషన్ పరిధి దానావాయిపేట శివారులో వాహన తనిఖీలు చేపడుతుండగా కొందరు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ఆరా తీయగా మావోయిస్టులు దళ సభ్యులు కరటం జోగా, పూనం జోగాల్‌తో పాటు కొరియర్ ఎం.గీతా గాయత్రిగా తేలింది. వీరు వరంగల్‌లో వైద్య చికిత్స చేయించుకుని వస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

హింసాత్మక ఘటనల్లో పాత్ర

పట్టుబడిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కృష్టారాం పోలీసుస్టేషన్ పరిధి బురుగులంకకు చెందిన కరటం జోగా అలియాస్ రాజేష్ ఉన్నాడు. ఆయన 1994 ఏడాదిలో మావోయిస్టు పార్టీలో చేరగా, కృష్టారాం ఏరియా కమిటీ సభ్యుడిగా, కార్యదర్శిగా, సౌత్ బస్తర్ డివిజన్ మిలిటరీ విభాగం ఇన్‌చార్జ్‌గా పనిచేయడమే కాక 2021 నుంచి డీకేఎస్‌జెడ్‌సీలో పనిచేస్తున్నాడు. ఆయనపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డు ప్రకటించింది. అంతేకాక 2010 తాడిమెట్ల అటవీ ప్రాంతాన 75 మంది, 2014లో తొంగ్‌పాల్ అటవీ ప్రాంతంలో 11మంది, 2017లో బెజ్జి అటవీ ప్రాంతంలో 11 మంది, అదే ఏడాది బుర్కాపాల్ పోలీసు క్యాంప్‌పై దాడి, 25 మృతి, 2018 లో కృష్టారాం అటవీ ప్రాంతంలో తొమ్మిది మంది, 2020లో ఎర్రవల్లి అటవీ ప్రాంతంలో ముగ్గురు, 2020లో 17 మంది, 2021లో టేకులగుర్మా అటవీ ప్రాంతాన జరిగిన ఘటనల్లో 22 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా వీటన్నింట్లో జోగా పాత్ర ఉందని ఎస్పీ తెలిపారు. అంతేకాక 2022లో చెన్నాపురం క్యాంప్‌పై దాడి, 2024లో ధర్మారం చింతవాగు, పామేడు వద్ద సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడి ఘటనల్లోనూ పాల్గొనాడని వివరించారు. ఆయన మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులతో కలిసి పనిచేశాడని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. ఇక మరో మావోయిస్టు పూనం జోగల్ అలియాస్ రాజు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గొండపల్లి వాసి కాగా 2022లో మావోయిస్టులో చేరాడు. సౌత్ బస్తర్ డివిజన్ జేరుగొండ ఏరియా కమిటీలో బాసగూడ ఎల్‌ఓఎస్ సభ్యుడిగా, ప్లాటూన్ సభ్యుడిగా గంగా, సుక్కు ఉంగా సారథ్యంతో పని చేశాడు. 2024లో ధర్మారం చింతవాగు, పామేరు సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లపై దాడి ఘటనల్లో ఆయన పాల్గొన్నాడు. కాగా, వైద్యపరీక్షల నిమిత్తం వరంగల్ వెళ్లి వస్తూ వీరిద్దరు పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు. ఇక ఎం.గీతా గాయత్రి చర్ల మావోయిస్టు పార్టీ కొరియర్‌గా పని చేస్తోందని ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు.

■ ధవళవర్ణం.. సోయగం!



ఆకుపచ్చని చెట్ల మధ్య ధవళవర్ణంలో మెరిసిపోతున్న గడ్డిపూలు వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. భద్రాద్రి జిల్లా కరకగూడెం – తాటిగూడెం గ్రామాల మధ్య వాగుల వెంట ఈ గడ్డిపూలు కనువిందు చేస్తున్నాయి. రహదారి పొడవునా కనిపిస్తున్న ఈ పూలు ప్రకృతి రమణీయతను చాటుతున్నాయి. – కరకగూడెం

సింగరేణిలో సీనియర్ సెక్యూరిటీ గార్డులకు పదోన్నతి



పదోన్నతి పొందిన ఉద్యోగులతో జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు తొమ్మిది మందికి సీనియర్ సెక్యూరిటీ గార్డులుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వారికి సోమవారం సెక్యూరిటీ జీఎం కె.శ్రీనివాసరావు ఉద్యోగోన్నతి పత్రాలు అందజేసి మాట్లాడారు. సింగరేణిలో సెక్యూరిటీ విభాగం కీలకమని, రూ.కోట్ల విలువైన ఆస్తులను కాపాడాల్సి ఉన్నందున సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ విభాగాల ఉద్యోగులు జె.వేణుమాధవ్, ఎండీ.జాకీర్‌హుస్సేన్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల భాగస్వాములకు వైద్యపరీక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది భాగస్వామల కోసం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గ్రాండ్ హెల్త్ చెకప్ శిబిరాన్ని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ సంస్థ ఎండీ ఆదేశాల మేరకు గతంలో ఉద్యోగులు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేశామని, తాజాగా వారి భాగస్వాములకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల భాగస్వాముల ఆరోగ్యం కూడా తమకు ముఖ్యమని చెప్పారు. ఈనెల 28వ తేదీ వరకు కొనసాగే శిబిరంలో 18 రకాల వైద్యపరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం భవానీప్రసాద్, డీఎం, ఉద్యోగులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యులు, సిబ్బందితో ఆర్‌ఎం

టోల్‌ప్లాజాను ప్రారంభించిన అధికారులు

నేలకొండపల్లి: కోదాడ – ఖమ్మం జాతీయ రహదారిలోని నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన టోల్‌గేట్‌ను సోమవారం జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కర్నాటి దివ్య ప్రారంభించారు. జాతీయ రహదారి 365(ఏ) మొత్తం 31.800 కి.మీ. మేర నిర్మించగా పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటుచేశారు. ఈమేరకు ప్లాజాను ప్రారంభించి పీడీ నిర్వహణ, వసూళ్లపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, ఇంజనీర్లు జి.కిరణ్, సీ.హెచ్.తేజ, సురేష్, శ్రీనాథ్, ప్రసాద్, అదానీ, పవర్‌మేక్ సంస్థల ప్రతినిధులు డి.సత్యానాథ్, సురేష్, అమర్‌నాథ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



టోల్‌ప్లాజా వద్ద సూచనలు చేస్తున్న పీడీ దివ్య

ఎస్‌బీఐటీలో పరిశీలించిన జేఎన్‌టీయూ బృందం



జేఎన్‌టీయూ బృందాన్ని సత్కరిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ తదితరులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: ఇటీవల అటానమస్ హోదా దక్కించుకున్న ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలను జేఎన్‌టీయూ బృందం సోమవారం సందర్శించింది. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు నేతృత్వాన పరిశీలించిన బృందం ఎస్‌బీఐటీ బోధన, ఫలితాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్ల వివరాలు తెలుసుకోవడంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. అలాగే, వరద ముంపుతో నష్టపోయిన విద్యార్థులు, సిబ్బందికి నిత్యావసర సామగ్రి, ఆర్థిక సాయం అందించారు. ఈక్రమాన ఎస్‌బీఐటీ చైర్మన్ జి.కృష్ణ, కరస్పాండెంట్ జి.ధాత్రి జేఎన్‌టీయూ బృందాన్ని సన్మానించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, కృష్ణకాంత్, ఏవీవీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలను సైతం రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు సందర్శించారు. వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడగా బీబీసీఎస్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ వి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, నోడల్ అధికారి డాక్టర్ డి.రమేష్,, అధ్యాపకులు పాల్గొన్నారు.